# ఆమె మనస్సు

**ఆ**మె రోడ్డుమధ్యగా నిలబడి చేతులు గాలిలో వూపుతూ ఆపమన్నట్లుగా సంజ్ఞ చేస్తోంది.

భాస్కరమూర్తి తన మోటారు లైటు కాంతిలో ఆమెని స్పష్టంగా చూసేడు ఆమె మంచుతెరమాటున మొగలిపువ్వులా నిలబడుతుంది. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. చలి ఎముకలను కొరికి, నరాలను మెలిత్రిప్పుతోంది.

అతడు వేగాన్ని తగ్గించాడు.

చలిగాలిసోకకుండా చెవులచుట్టూ మఫ్లర్ చుట్టుకున్నాడు. సాయి, ఆచారి ఎంతగా చెపుతున్నా వినిపించుకోకురఊమూర్ఖంగా బయల్దేరిరావటం తప్పు చేశానేమోనన్నంతగా బాధపెడుతోంది చలి.

సాయికి ప్రమోషన్ రావటం పార్టీ ఏర్పాటు చెయ్యటం, అలవాటులేకపోయినా మూడు పెగ్గుల విస్కీని గటగటమని త్రాగెయ్యటం అంతా సవ్యంగాను, హాయిగాను ఉత్సాహంగాను జరిగిపోయినాయ్. కాని, పార్టీ అయ్యాక అతడు తిరిగి విజయవాడ ప్రయాణమైనపుడు స్నేహితులిద్దరూ వద్దని సలహా ఇచ్చేరు. బ్రతిమాలేరు కాని భాస్కరమూర్తి విన్లేదు. మొండిగా వయల్దేరాడు. 'గుంటూరు నుంచి విజయవాడ ఎంతసేపోయ్– మీరిక్కడ భోజనాలు ముగించేసరికి నేనక్కడ విజయవాడలో వుంటా' నంటూ బండీవేసుకు బయల్దేరాడు. మిత్రులిద్దరూ మరొక్కసారి హెచ్చరించి, వీడ్కోలు పలికారు.

తీరా గుంటూరు వదలి, నంబూరు సమీపించేసరికల్లా, ఈ రాత్రికి వాళ్ళన్నట్టు అక్కడుండిపోతే బావుండేదేమోనన్న శంకమొదలైంది. కటికచీకటి, సూదులు పెట్టి గుచ్చుతున్నట్లుగా చలి, పైగా ఆరోజు విపరీతంగా మంచు కురుస్తోంది. త్రాగిన విస్కీ చలివల్లకాబోలు నీళ్ళు కారినట్లు జారిపోయింది. మంగళగిరికొండను చూసేక అనుకున్నాడు 'ఇంకెంత' ? పదిహేను, ఇరవై నిమిషాలు. అటు తర్వాత తనింట్లో, తనగదిలో, కంబళీ క్రింద వెచ్చవెచ్చగా....'

అతడా విధంగా మంచులో తడుస్తూ, వెచ్చగా ఆలోచించుకుంటూ సాగిపోతుండగా ఆమె రోడ్డుమధ్యన నిల్చుని ఆశగా, భయంగా సంజ్ఞలతోనే ఆర్ధిస్తోంది.

భాస్కరమూర్తి ఆమెని సమీపించగానే బండినాపేడు.

ఆమె అతడి దగ్గరగా వచ్చింది. చలివల్ల గడగడా నిలువెల్లా వణికిపోతోంది. ఆమె కళ్ళలో కంగారు, బెదురుగాఔెనకచూపులు చూస్తోంది.

"ప్లీజ్– లిఫ్టు– విజయవాడవరకు– బ్యారేజీపై వదిలెయ్యండి చాలు–"

ఆమె మాటలో అర్థింపుకన్నా ఆత్రం, తొందర, భయం గోచరించాయి. భాస్కర మూర్తికి. అంత కంగారు, చలి, విస్మయాల్లో గూడా అతడామెని పరీక్షగా చూసేడు.

పాతికేళ్ళు పైబడ్డ వయసు చెక్కుచెదర్లేదు. ఆ వయస్సు ఆమె శరీరంలో కొన్ని చోట్ల పొంగులుగాను, మరికొన్ని చోట్ల పెట పెటలుగాను కన్పిస్తోంది. గుండ్రని మొహంపై దోసగింజంత బొట్టు అందంగాను, ఆర్టిస్టిక్కుగాను వుంది. నొక్కుల జుట్టు ఆశల్ని రేకెత్తించేలా వుంది. ఆమె కొంగుని బిగించి చుట్టూ కప్పుకుంది.

'ఎనీ ట్రబుల్' అన్నాడతను విషయం తెల్సుకోవాలన్న ఉద్దేశ్యంతో.

ఆమె మళ్ళీ భయం భయంగా వెనక్కు చూసి, 'వెధవలు ఒక్కడని చెప్పి తీసుకొచ్చి గొడవ చెయ్యటం ప్రారంభించారు. అందుకని పారిపోయి వచ్చేశాను'

భాస్కరమూర్తి కర్థం కాలేదు– వెధవ లెవరు? ఒక్కడని చెప్పటమేమిటి? ఆపైన గొడవంటే ఏమిటి?– ఏవీ అర్థంకాలేదు.

'ఎవరు వాళ్ళు?' అనడిగాడు తనూ ఆమె చూస్తున్న వైపుగా చూసి.

అపుడామె, అతని అమాయకత్వాన్ని చూసి కాబోలు పక్కున వెచ్చగా నవ్వింది. తల్లోవున్న మల్లెచెండుని తీసి చీకట్లోకి విసిరేస్తూ– 'అన్నీ చెబుతాలేగాని, ముందు నన్నిక్కడి నించి తీసుకెళ్ళు– లేకపోతే ఆ వెధవలు మళ్ళీ వచ్చే ప్రమాదం వుంది.

అందులో త్రాగున్నారు కూడానూ' అంది.

అతడికి గుండె దడదడలాడింది. అంచేత మరేం ఆలోచించకుండా 'సరే ఎక్కుకాని బ్యారేజీ వరకే సుమా' అన్నాడు.

ఆమె స్కూటరెక్కికూర్చుంది. అతడిని సుతారంగా పట్టుకోవటంవల్ల చలికి వొణుకుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

'మఫ్లర్ కావాలా' అనడిగాడు మధ్యలో. ఆమె వొద్దంది.

భాస్కరమూర్తికి దాదాపు ముప్ఫై ఏళ్ళున్నా, ఇరవయ్యంటే ఇట్టేనమ్మేస్తారు. సన్నగా, పొడుగ్గా గడవాసంలా వుంటాడు. నున్నగా షేవ్ చేసుకోవటం వల్ల, కళ్ళద్దాలు ధరించటంవల్ల, మొహం చూస్తే పెద్దవాడిలానూ, శరీరం చూస్తే చిన్నపిల్లవాడిలాగాను వుండి రెండింటికి సమన్వయం కుదరక విచిత్రంగా వుంటాడు. పెద్ద ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం, మంచి జీతంతో పాటు స్కూటర్ని గూడా ఇచ్చేరు. ప్రస్తుతం భార్య ప్రసవం పనిమీద పుట్టింట్లో వుంది.

మౌనంగా స్కూటర్ని నడిపిస్తూ మధ్యలో అడిగాడు విజయవాడలో ఏపేట? ఆమె ఆ ప్రశ్నకి తెలివిగా సమాధానం చెప్పక విననట్లుగా వూరుకుంది. గతుకుల్లోంచి బండి వెళ్ళినపుడు ఆమె రొమ్ములు అతడికి గుచ్చుకుని వింత అనుభూతినందిస్తున్నాయ్.

ఉన్నట్లుండి మళ్ళీ అడిగాడు 'అవునూ ఎవరో మగాళ్ళు అల్లరిపెట్టేరన్నావ్– మీ ఫ్రెండ్సా?' అని.

ఆమెకిప్పుడు ధైర్యం వచ్చినట్లుగా పకపకానవ్వింది. అతడి భుజం పై వ్రాలి 'ఫ్రెండ్సా నాబొందా– పాసింజర్సు, కస్టమర్సు – ఒక్కడని చెప్పి కార్లో ఎక్కించుకుని బయలేద్దారాడొకడు. త్రోవలో మరో ముగ్గురెక్కాడు. బాగా త్రాగున్నారు. తోవలోనే, కార్లోనే గొడవ చెయ్యటం మొదలెట్టారు. అందుకని పారిపోయొచ్చాను' అందామె చాలా తేలిగ్గా.

భాస్కరమూర్తికి మాత్రం గుండె దడ దడ లాడింది. ఆమెవరో, ఏమిటో అర్ధమైంది అతడు పూర్తిగా పాతకాలం మనిషి. ఈ కాలం కుర్రాళ్ళతో పోలిస్తే చాలా విరుద్ధంగా కన్పిస్తాడు. అతనికిటువంటి సరదాలు, వుద్దేశ్యాలు వుండవు. అందువల్ల వాళ్ళ ఆలోచనా ధోరణిగాని, మనస్తత్వాలుగాని, తెలీవు.

'నువు పారిపోయి వచ్చేస్తుంటే వాళ్ళెలా చూస్తూ వూరుకున్నారు?' అడిగాడు.

ఆమె అతడి భుజంపై వ్రాలి, చెవిలో రహస్యం చెబుతున్నట్లు 'వాళ్ళలా గొడవ చేస్తుండగా లక్కీగా కారుకాస్తా పాడైంది. నలుగురూ క్రిందకిదిగి రిపేరు మొదలెట్టారు. అదే సమయమన్చెప్పి చీకటమాటున చక్కా వచ్చేను' అంది.

ఆమె చెప్పేది కట్టుకథ కాదన్న నిర్ణయానికొచ్చి భాస్కరమూర్తి మరేం మాట్లాడ లేదు.

విజయవాడ వచ్చేసింది ప్రకాశం బారేజీ చేతులు చాచిచల్లగాలితో స్వాగతం చెబుతోంది. దానిపైన దీపాలు మాత్రం, ప్రకాశించాలా వద్దానన్న సందేహంమొచ్చి, నివృత్తికాక ఆలోచనల్లో వున్నట్లు మిణుకు మిణుకు మంటున్నాయ్.

భాస్కరమూర్తి స్కూటర్ని బ్యారేజ్ చివరికంటా వెళ్ళాక ఆపేడు. ఆమె దిగి అతడి ముందుగావచ్చి నిల్చుంది. ఆమె 'థాంక్స్' అన్నపుడు తను నవ్వాలో, లేక ఏవైనా ధైర్యంగా చిలిపిగా అనేద్దామని ఆలోచిస్తుండగా ఆమె అంది 'మాదేమో గుంటూరు నన్నిక్కడ దింపావు– ఏమిటి చెయ్యటం'.

అతడు అర్ధంకానట్లు చూసేడు.

ఆమె మళ్ళీ 'నీ తప్పేంలేదు నేనాకంగారులో, భయంతో, అక్కడి నుంచి ఎలాగైనా బయటపడాలని ఆలోచించానే గాని, వేరుగా కాదు' అంది.

భాస్కరమూర్తి ఏం మాట్లాడటానికిష్టపడక అలాగే వుండిపోయాడు.

ఆమె జారిపోతున్న కొంగుని సరిచేసుకుంటూ 'ఏమిటి చెయ్యటం వూరుకాని వూరు అందులో పోలీసోళ్ళు చూసారంటే...' అంటున్నప్పుడు ఆమె మొహంలో

భయంతాలూకు ఛాయలు–

అతడికి జాలేసింది. టైము చూసేడు. చివరి బస్సు కూడా వెళ్ళిపోయుటుంది. అతడు వెళ్ళటానికని సన్నద్ధుడవుతుండగా చటుక్కున ఆమె అంది 'నువు ఒంటరిగాడవేగా?'

అతడు తెల్లబోయాడు. 'ఆ సంగతి నీకెలా తెల్సు?' అన్నాడు.

ఆమె గంట వాయించినట్లుగా నవ్వింది. 'ప్రపంచంలో మగాళ్ళందరూ ఒంటరిగానే వుండాలని మేమనుకుంటాం. అంచేత ప్రతివాళ్ళని మేమనుకుంటాం. అంచేత ప్రతి వాళ్ళని ముందు అలానే అంటాం' అని మళ్ళీ నవ్వింది.

అతడూ కలివిడిగా నవ్వాడు. అతడినవ్వు చూసాక ఆమెలో ధైర్యం వచ్చి,'ఈ ఒక్క రాత్రికి ఆశ్రయం ఇవ్వవా? తెల్లవారక ముందే వెళ్ళిపోతాను' అనడిగింది. ఆమాట విని అతడు భయపడ్డాడు. ఎవరన్నా చూస్తే?

'అబ్బే వీలుకాదు– ఎవరన్నాచూస్తే బావుండదు' అన్నాడు భయంగా

'అర్ధరాత్రవుతోంది ఎవరు చూస్తారు– తెల్లవారేసరికల్లా వెళ్ళిపోతాను. నీ పెద్ద మనిషితనానికేం భంగంరాదు.

అతడు ఆలోచించాడు ఆడది అర్ధరాత్రి, వూరు కాని వూరు, చలి, పోలీసులు– అయ్యో పాపమనిపించింది. పోనీ వస్తుంది– ముందు గదిలో చాపపడేస్తే పడుకుంటుంది, తెల్లవారి పాలవాడు వచ్చినపుడు మసక చీకట్లోకి వెళ్ళి పోతుంది. తనకేమిటి నష్టం? తన పరువు ప్రతిష్టలకేం దెబ్బలేదు గదా– పైగా, రేపు ఫ్రెండ్స్‌తో మానవత్వం గురించి, స్త్రీ సంక్షేమం, రక్షణల గూర్చి గట్టిగా, ధైర్యంగా మాట్లాడే వీలుంటుంది.

'అబ్బ– తర్వగా చెప్పు– చలేస్తోంది' అనటంతో భాస్కరమూర్తి తేరుకుని 'సరేకాని తెల్లవారకముందే వెళ్ళిపోవాలి తెల్సిందా? కేవలం ఆడదానివన్న జాలితోనే సరేనంటున్నాను' అన్నాడు.

ఆమె అలాగేనని మళ్ళీ స్కూటరెక్కి కూర్చుంది.

భాస్కరమూర్తి వుండేది లబ్బీపేటలో రెండుగదుల డాబా ఇల్లు, రోడ్డుమీదకే తలుపు వుండటం ఎంత సుఖమో అర్థమైందతడికి. తలుపుతీసి ఆమెనిలోనికెళ్ళమని– స్కూటర్ని ప్రక్కనున్న ఖాళీ స్థలంలో వుంచి తానూ లోనికెళ్ళాడు. ఆమె ముందు గదిలో నిలబడి ఇంటిని తేరపార చూస్తోంది. అతడు చకచకా బట్టలు మార్చుకుని నైటు పైజమాలాల్చీ వేసుకున్నాడు. ఆమెకి చాప దిండుపడేసి, తాను సాయంత్రం త్రాగగా మిగిలిన కాఫీని వెచ్చ చేసి, రెండు గ్లాసుల్లో పోసి ఒకటి తను తీసుకుని, మరో గ్లాసు తెచ్చి ఆమెకిచ్చాడు. ఆమె దాన్నందుకుంటూ' ఇంత తర్వగా కాఫీ ఎలా తయారుశావ్?' అడిగింది.

'నేను రాత్రిపూట టీగాని, కాఫీ గాని– త్రాగటం అలవాటు– అన్నట్లు ఇంకో ముఖ్యమైన విషయం, తెల్లవారు ఝామున పాలవాడు తలుపు తడతాడు, నువ్వు మాత్రం తలుపు తియ్యొద్దు.వాడు చూసాడంటే మాయావిడకి చెపుతాడు, తెల్సిందా? అన్నాడు.

ఆమె సరేనన్నట్లు తలూపింది. తర్వాత 'ఏం అనుకోకపోతే పాత చీరవుంటే ఏదైనా పడెయ్యవూ చలితో చస్తున్నాను– మంచువల్ల పూర్తిగా తడిసిపోయింది–' అంది తలొంచుకుని.

అతడు మౌనంగా వెళ్ళి చీరొకటి తెచ్చి ఆమె ఒళ్లో పడేశాడు. తర్వాత దుప్పటి తెచ్చేందుకు లోనికెళ్ళాడు.

ఒక్కక్షణంలో దుప్పటి తీసుకుని వచ్చేసరికి ఆమె ధరించిన చీర విప్పి అతడిచ్చిన చీరని ఎటునుంచి ఎట్టుకోవాలని పరీక్ష చేస్తోంది.

అప్పుడే భాస్కరమూర్తిలో అనుకోకుండా అకస్మాత్తుగా, ఆక్షణంలోనే కోరిక పుట్టింది దానిక్కారణం– ఆమె నునుపైన భుజాలు, పరిమాణంలో పెద్దవిగా వున్న వక్షం, లంగాలోంచి లీలగా కన్పిస్తున్న బలమైన తొడలు వెరసి అందమైన అయుబాటులో వున్న ఆడతనం.

అతడిలోని అలజడిని ఆమె గమనించింది. చకచకా చీర చుట్టుకుంది.

అతడు ఒక్కడుగు ముందుకేసాడు. ఆమె చాపని పరచి, దిండు సర్దుకుని ఏం పట్టనట్టు పడుకుంది. భాస్కరమూర్తి మెల్లిగా సమీపించి ప్రక్కనే కూర్చున్నాడు.

ఆమె అతనివంక ఏవిటన్నట్లుగా చూసింది. అనుభవం లేమి వల్ల కోర్కె, భయాల వల్ల సన్నగా వణుకుతున్నాడు ఆమెకి జాలేసింది. అతని చెయ్యి తన చేతిలోకి తీసుకుంటూ "ఏవిటలా వణుకుతున్నావ్?" అంది.

అతడేం మాట్లాడక, ఆమె చెంపల్ని, భుజాల్ని నిమురుతున్నాడు. ఆమెకి అసహనంగా, అలజడిగా అన్పించి లేచికూర్చుంది. "నీ వుద్దేశ్యం అర్థమైంది. మరామాట బ్యారేజీ దగ్గర చెపుతే సరిపోయేదిగా. అంతాలోచనెందుకు చేసావ్. నన్నుమోసం చెయ్యాలన్నా? వందరూపాయలవుతుంది– వున్నాయా?"

అపుడతను "నిజంగా నాకప్పుడా వుద్దేశ్యం లేదు. కాని ఇప్పుడే– ఇక్కడే– ఈ క్షణంలో...." అంటూ చటుక్కున లేచ్చి వంద రూపాయల కాగితం తెచ్చి ఆమె ఒళ్ళో పడేశాడు. తర్వాత మళ్ళీ ప్రక్కనే కూర్చున్నాడు.

ఆ కాగితాన్ని తీసి ప్రక్కనుంచింది. అతడిని ఒడిలోకి లాక్కుని, జుట్టుని సరిచేస్తూ "నువు చాలా అమాయకుడివి, మంచివాడివి. అనుభవం లేనివాడివని అర్థమవుతోంది నాకు ఆశ్రయమిచ్చావ్– నువు కాదంటే ఏమైపోయేదాన్నో తెలీదు. నీకు తెలీదు, బయట భయంకరమైన మృగాల్లాంటి మొగాళ్లున్నారు. వాళ్ళ ముందు నువు చాలా మంచివాడివి. అందుచేత నా మాటవిను– కోర్కెని చంపెయ్యి– వెళ్ళి పడుకో" అంది.

అతడు ఆమెని చుట్టుకుంటూ నువ్వడిగినట్లు డబ్బిచ్చాగా, నీకభ్యంతరమేమిటి?' అన్నాడు.

ఆమె నవ్వింది– 'నిజమే– నాకభ్యంతరముండ కూడదు నిజానికి –కాని నీ విషయంలో నాకుంది. కారణం– నువు నాకు సహాయం చేశావ్. అంచేత నేను నీ మంచిని కోరాలి– అదీకాక నీలాంటి పసిపిల్లల్లాంటి మగాళ్ళంటే నాకు చాలా ఇష్టం– ఇష్టమంటే ఆ ఇష్టం కాదు–'

అతడు వినేస్థితిలో లేడు. ఉన్మత్తుడిలా పూనకం వచ్చినవాడిలా చకచకా సాగిపోతున్నాడు.

అతడినాపటం కష్టమనిపించి, అతడు చేస్తున పన్లకి మొహం చిట్లిస్తూ చివరి సారిగా అంది 'నామాట వినవా– నువ్వంటే నాకు గౌరవం, ప్రేమ, ఇష్టం అన్నిటి మీద వొట్టు– నా మాట విను.'

అతడు విననని చేతులతో చెప్పాడు. ఆమె బరువుగా నిట్టూర్చింది కొద్దిక్షణాలకి ఆ గదిలో దీపం ఆర్పబడింది.

తెల్లవారుఝామున పాలవాడు తలుపు బాదటంతో కళ్ళు నులుముకుంటూ లేచాడు భాస్కరమూర్తి. పాలవాడు ప్యాకెట్టు నందిస్తూ 'ఏంటిబాబూ రాత్రి తలుపు గడిపెట్టడం మరచిపోయారా?' అనటంతో వులిక్కిపడి చూసాడు.

ఆమె లేదు. అప్పటికే వెళ్ళిపోయింది. తలుపు గడియపెట్టి లైటువేశాడు అతడిచ్చిన చీర అక్కడే వుంది. వందరూపాయల కాగితం కూడా టేబులుపైన వుంది.

నిద్రమత్తులో వున్న అతడికి అవన్నీ పెద్ద విషయాలుగా అన్పించక మళ్ళీ లైటార్పి పడుకున్నాడు.

....మూడు రోజుల తర్వాత, భాస్కర మూర్తికి కొత్త సమస్య ఎదురైంది. అంతరంగికమైన సమస్య, పదిమందికి చెప్పుకో లేనిది. అలాగనితనలో యిముడ్చుకోలేనిది.

ఏం చెయ్యాలో తోచక మధనపడి చివరికి నిశ్చయానికొచ్చాడు.

...డాక్టరు ఇంజక్షన్ సూదిని చేతికండలోకి గుచ్చుతూ 'ఏవైనా ఎడ్వంచర్ చేసేవా?' అన్నాడు సూదుల్లాంటి చూపులతో.

అతడు బాధతో మొహం చిట్లించాడు.

ఇంజక్షన్ చేసిన చోట దూదితో తుడుస్తూ 'ఎడ్వంచర్స్ చెయ్యొచ్చు కాని ఌత హోప్లెస్ ఎడ్వంచర్స్ ఎప్పుడూ చెయ్యక. త్వరగా వచ్చేవు గనక సరిపోయింది. లేకుంటే చాలా ప్రమాదమయ్యేది,' అన్నాడు.

భాస్కరమూర్తి తలెత్తలేదు.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ కాగితాన్నందిస్తూ 'ఆ మాత్రలు, కాప్సుల్స్ వారం రోజులు వాడాలి. తర్వాత వచ్చి కనబడు' అన్నాడు.

ఆయనికి ఫీజు చెల్లించి, ఆస్పత్రిమెట్లు దిగుతుండగా ఆమె చెప్పిన మాటలు గుర్తుకొచ్చి ఒక్కక్షణం ఆగేడు–

'నువ్వంటేనాకు గౌరవం– ప్రేమ– ఇష్టం అందుకే వద్దు నా మాటవిను'

కదిలి వెళ్ళిపోతూ తనలో అనుకున్నాడు ఆమెను మళ్ళీ ఒక్కసారి చూస్తే బాగుండునని.